వాటర్ అవేర్‌నెస్

- నీటిని వృథా చేయొద్దు
- నల్లాలకు మీటర్లు బిగించుకోవాలి
- సీనియర్ సిటిజన్ యాప్ ద్వారా ట్యాంకర్‌లను సులభంగా బుక్ చేసుకోవచ్చు
- హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ మేనేజర్ యాదయ్య



మాదాపూర్: అసలే ఐటీ కారిడార్..ఇక్కడ పెద్ద పెద్ద కంపెనీలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సముదాయాలూ ఎక్కువే. నీటి వినియోగం కూడా అధికంగా ఉంటుంది. ఇక వేసవి కావడంతో నీటి సమస్య తీవ్రంగానే ఉంటుంది. ఈ క్రమంలో నీటి వృథాను అరికట్టడం, పొదుపుగా వాడుకోవడం, నల్లాలకు మీటర్లు బిగించడంపై జలమండలి దృష్టి సారించింది. ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. వేసవి నేపథ్యంలో జలమండలి తీసుకుంటున్న చర్యలపై మాదాపూర్ హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై సివరేజ్ బోర్డు) మేనేజర్ యాదయ్య సాక్షికి వివరించారు.

ప్ర: వేసవిలో నీటి ఎద్దడి గురించి..

జ: ప్రతి సంవత్సరం వేసవిలో నీటి ఎద్దడి ఉంటుంది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం తక్కువగా ఉంది. కాగా క్యాన్ నంబర్లు ఎక్కువగా ఉండడంతో బుక్ చేసిన రెండు రోజులకు ట్యాంకర్ వస్తుంది. 5వేల లీటర్లు రూ.500, 10వేల లీటర్లు రూ.1000గా ఉన్నాయి. హెచ్‌ఎండబ్లూ ఎస్ఎస్‌బీ సైట్ ద్వారా ట్యాంకర్‌లను క్యాన్ నంబర్‌లతో బుక్ చేసుకోవచ్చు. మాదాపూర్‌లో 5ఎంఎల్ (ఐదు మిలియన్ లీటర్లు) రిజర్వాయర్ ఉంది. జనాభా పెరగడంతో దానికి తగ్గట్టుగానే నీటి సరఫరా చేస్తున్నాము. కనెక్షన్ విషయంలో ఏరియాను బట్టి డీడీలను చెల్లించాల్సి ఉంటుంది. ప్రాసెస్ పూర్తి అయిన 15 రోజులలో కనెక్షన్ ఇస్తున్నాము. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సమాచారం ఇస్తే 24 గంటల్లో సమస్యను పరిష్కరిస్తాం.

ప్ర: మంచినీటి వృథాపై..

జ: ఎక్కువగా కాలనీలలో, బస్తీలలో మంచినీరు వృథా అవుతుంది. నెలకోక సారి మంచినీటి వాడకంపై అవగాహన కల్పిస్తున్నాము. మంచినీటి పైప్‌లకు ఆన్,ఆఫ్ బటన్ పెట్టుకోకపోవడంతో సంపులు నిండి పొర్లిపోతున్నాయి. కొంతమంది అలాగే వదిలేస్తారు. మీటర్లను ప్రతి ఒక్కరు పెట్టుకోవాలి. అప్పుడే ఖచ్చితమైన నీటి వినియోగం తెలుస్తుంది. ఇంటికి సరిపడా నీటిని అందించడానికి వీలవుతుంది.

ప్ర: అక్రమంగా మోటార్లు పెట్టే వారిపై తీసుకుంటున్న చర్యలు..

జ:. చాలామంది ముందు డొమెస్టిక్ కనెక్షన్ తీసుకుంటారు. తర్వాత కమర్షియల్ భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో జనాభా పెరిగిపోవడంతో నీటి సమస్య వస్తుంది. కమర్షియల్ భవనం కట్టకముందే దానికి తగ్గట్టు డీడీలు కట్టి నీటి పైప్ సైజును పెంచుకోవాలి. అప్పుడు నీటి సమస్య రాదు. అక్రమంగా మోటార్‌లను ఏర్పాటు చేసి నీరు లాగితే విజిలెన్స్ సిబ్బంది కఠిన చర్యలు తీసుకుంటారు.

మంచినీటి ట్యాంకర్‌ను బుక్ చేసే విధానం..

సీనియర్ సిటిజన్ యాప్ ద్వారా మంచినీటి ట్యాంకర్‌లను సులభంగా బుక్ చేసుకోవచ్చు. మొత్తం 70 ట్యాంకర్‌లు అందుబాటులో ఉన్నాయి. బిల్లింగ్, కంప్లైట్స్, కనెక్షన్, మీటర్, స్టేటస్ తదితర వివరాలను యాప్‌లోనే తెలుసుకోవచ్చు. కస్టమర్ కేర్ నంబర్ 155313లలో సంప్రదించాలి. ఏవైనా సమస్యలు వస్తే వెంటనే తెలియపరచాలి.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



హోంగార్డు కుటుంబానికి చెక్కు అందిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర, పోలీసు అధికారులు

రాయదుర్గం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి సైబరాబాద్ కమిషనరేట్ ద్వారా ఆర్థిక సహాయంను సీపీ స్టీఫెన్ రవీంద్ర అందజేశారు. రూ.11.60 లక్షల చెక్కును మేడ్చల్‌కు చెందిన జి శ్రీనివాస్ కుటుంబసభ్యులకు సీపీ అందించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, అదనపు డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డి సమక్షంలో చెక్కును అందించారు. కాగా అతని తల్లికి మేడ్చల్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ బిఎస్‌ఎస్‌రెడ్డి నెలకు రూ.2,500 ఒక ఏడాది పాటు అందిస్తానన్నారు. బాధిత కుటుంబానికి రూ.30 లక్షల బీమా అందించారు.

ఆశానగర్‌లో 'పబ్లిక్ కాంటాక్ట్'



కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ పరిధి ఆశానగర్‌లో పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశానగర్, ఛత్రపతి శివాజీ నగర్, మహంకాళి నగర్, శంషీగూడ కాలనీలలోని సమస్యలను తెలుసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యలను అధికారులకు నేరుగా చెప్పుకొని పరిష్కరించుకోవాలని తెలిపారు. అదే విధంగా అధికారులు వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు కాశీనాద్ యాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వెంకట్ నాయక్, దాతి రమేష్, అంజయ్య యాదవ్, ఎం. శ్రీనివాస్, వెంకటకృష్ణ, పి. మహేష్, పోశెట్టి గౌడ్, స్వరూప పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 45, కాకర 50, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 150, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10, క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 150.

వాహనాల తనిఖీ



దీప్తి శ్రీనగర్ వద్ద ద్విచక్ర వాహనంను తనిఖీ చేస్తున్న మియాపూర్ పోలీసులు

మియాపూర్ : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, జేపీనగర్ ప్రాంతాలలో ప్రధాన రోడ్డు వెంబడి మియాపూర్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. మియాపూర్ డీఐ కాంతారెడ్డి, ఎస్ఐ గిరీష్‌లు సరైన పత్రాలు ఉన్నాయా అని పరిశీలించారు. అదేవిధంగా నంబర్ పేట్లు లేకుండా, కనబడకుండా ఉన్న వాహనాలను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మధ్య కాలంలో చైన్‌స్నాచింగ్, పార్కింగ్ స్థలాల నుండి వాహనాల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి కాలనీ, రోడ్ల వెంబడి తనిఖీలు నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

బాంబు ఉందంటూ ఐటీ కంపెనీకి బెదిరింపు కాల్

మాదాపూర్: ఐటీ కంపెనీలో బాంబు ఉందని బెదిరింపు కాల్ చేసిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని టీసీఎస్ కంపెనీలో బాంబు ఉందని ఓ వ్యక్తి ఫోన్ చేయడంతో మాదాపూర్ పోలీసులు ఐటీ కార్యాలయాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. మరిన్నీ కంపెనీలలోనూ టీంలతో తనిఖీలు చేసినట్టు తెలిపారు. దాదాపు 1500 మంది ఉద్యోగులు టీసీఎస్‌లో పనిచేస్తున్నారు. తనిఖీలు జరుగుతుండగా అదే వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి బెదిరింపు కాల్ అని చెప్పడంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా 6నెలల క్రితం అదే కంపెనీలో పనిచేసి మానేసినట్టు తెలిపారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 13 మందికి చేసినట్లు చెప్పారు.

నియామకం

- చందానగర్ సర్కిల్ -21 టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా రాజ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్‌గా మౌనిక

మియాపూర్ : చందానగర్ సర్కిల్ -21 టౌన్ ప్లానింగ్ ఏసీపీగా రాజ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్‌గా మౌనికలు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు జూబ్లీహిల్స్ సర్కిల్-19లో ఏసీపీగా పనిచేసిన రాజ్‌కుమార్, ఉప్పల్‌లో సెక్షన్ ఆఫీసర్ మౌనికలు చందానగర్ సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు చందానగర్ సర్కిల్‌లో పనిచేసిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్ సర్కిల్-19కు బదిలీ కాగా సెక్షన్ ఆఫీసర్ మధు పటాన్‌చెరుకు బదిలీపై వెళ్లారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బండలగూడలో ఓ రియల్ వ్యాపారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనకార్మిక సమితి తెలంగాణ అధ్యక్షుడు జనంపల్లి కమల్ శుక్రవారం తహసీల్దార్ జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండలగూడలో 4 ఎకరాల పట్టా భూమి ఉండగా 5 ఎకరాల్లో వెంచర్ వేశారని తెలిపారు. సుమారు ఎకరం ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మియాపూర్ : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..లింగంపల్లిలోని తారానగర్ కూరగాయల మార్కెట్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (35-45) పడి ఉన్నాడని స్థానికులు చందానగర్ పోలీసులకు శుక్రవారం సాయంత్రం సమాచారం అందించారు. వెంటనే చందానగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. అతని గురించి చుట్టుప్రక్కల ఆరా తీయగా ఎటువంటి సమాచారం లభించలేదు. చేతిపై కాలిన గుర్తులను గుర్తించారు. మృతుడు పింక్ కలర్ టీ షర్ట్, యాష్ కలర్ జీన్స్ ప్యాంట్, చేతికి భజరంగ్ రబ్బర్ బ్యాండ్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ కార్మికులకు న్యాయం చేయాలి



గచ్చిబౌలి పీఎస్ వద్ద సీఐటీయూ నాయకులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి పరిధి గచ్చిబౌలిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కార్మికులకు న్యాయం చేయకుంటే జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరికృష్ణ, ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, చందు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది గచ్చిబౌలిలోని ఇన్‌స్పెక్టర్‌ను శుక్రవారం కలిశారు. గత నెల 29న ముగ్గురు జీహెచ్‌ఎంసీ కార్మికులను ఇన్నోవా ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలు, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కారు యజమాని కార్మికులకు చికిత్స చేయిస్తానని ఒప్పుకుని అపోలో ఆస్పత్రిలో రూ.50 వేల రూపాయలు చెల్లించారు. ఈ క్రమంలో ట్రీట్మెంట్ చేయకుండా ఫోన్ ఎత్తకుండా నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురు వారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 12 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున, మరో ఇద్దరికి రూ. 5 వేలు జరిమానా విధించారన్నారు.

వరద వెళ్లేదెలా సారూ...



కేబీఆర్ పార్కు ముందు నిలిచిపోయిన వర్షపు నీరు

వెంకటేశ్వరకాలనీ: జంక్షన్ల సుందరీకరణలో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారుల అడ్డగోలు పనులకు కేబీఆర్ పార్కు వద్ద వర్షం వస్తే కనిపించే పరిస్థితి అద్దం పడుతోంది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద వర్షం వచ్చిన ప్రతిసారీ కేబీఆర్ పార్కు ప్రధాన గేటుతో పాటు పార్కుకు దారి తీసే మార్గంలో పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోతున్నది. ఇక్కడ వర్షానికి నిలుస్తున్న నీరు పోయేందుకు సరైన దారి లేకపోవడంతో వర్షం ఆగిపోయిన తర్వాత నాలుగు రోజుల వరకు కూడా నీళ్లు పోవడం లేదు. దీంతో వాకర్లు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

మామను హత్య చేసిన కేసులో అల్లుడికి జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: మామను హత్య చేసిన కేసులో అల్లుడికి జీవిత ఖైదు పడింది. బీడీఎల్ సీఐ వినాయక రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన ఖాజామీయా కూతురు బిపాసాను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ఫకీర్ అలియాస్ సత్తార్‌కి ఇచ్చి వివాహం చేశారు. సత్తార్ మద్యానికి బానిసై భార్య బిపాసాను తరచు వేధిస్తుండటంతో గత ఏడాది మార్చిలో ఆమె నందిగామకు వచ్చింది. అయితే సత్తార్ కూడా అత్తగారి ఇంటికి వచ్చి అక్కడే ఉంటూ పటాన్‌చెరు మండలం కర్దనూరు సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. గత ఏడాది మే 18 తేదీన సత్తార్ తన భార్య బిపాసాను కొట్టగా, ఆమె గ్రామ పెద్దలకు చెప్పేందుకు పంచాయతీకి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న మామ ఖాజామియా(75)ను అల్లుడు సత్తార్ కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. కూతురు ఇంటికి వచ్చి చూసేసరికి తండ్రి రక్తపు మడుగులో ఉన్నాడు. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భర్తపై ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో భాగంగా సత్తార్‌ను జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శశిధర్ రెడ్డి ముందు హాజరుపరిచారు. శుక్రవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్‌రెడ్డి వాదోపవాదాల అనంతరం సత్తార్‌కు జీవిత ఖైదుతో పాటు ఐదు వందల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో సత్తార్‌పై రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో ఐదేళ్ల బాలుడి హత్య కేసులో అభియోగం మోపగా, హైకోర్టుని ఆశ్రయించాడు. దీంతో హైకోర్టు ఆ కేసును కొట్టేసింది.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతనగర్‌లో మంజీర పైపులైన్ లీకేజీ, మంచినీటి సమస్యను జలమండలి అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరగా మరమ్మతులు చేయాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. నీటి సమస్య తలెత్తకుండా కిందిస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రతి కాలనీ, బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ ప్రశాంతి, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, లైన్‌మెన్ సునీల్, పాల్గొన్నారు.



సమతనగర్‌లో పైపులైన్ లీకేజీలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్



స్నాచింగ్ కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. దర్గపల్లి, తాండూరు, వికారాబాద్ జిల్లాకు చెందిన దివాటే ప్రశాంత్ (23) గచ్చిబౌలిలోని ఐడీబీఐ క్యాంపస్‌లో ఆఫీస్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. గొల్ల జనార్దన్ యాదవ్(25) గచ్చిబౌలిలోని ఎస్‌బీఐ ట్రెనింగ్ సెంటర్‌లో సూపర్‌వైజర్‌గా పని చేసి మానేశాడు. ఏప్రిల్ 27న రాత్రి 9 గంటల సమయంలో ఆదిభట్ల టీసీఎస్ ఐటీ ఉద్యోగిని ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో బస్సు దిగి డీఎల్ఎఫ్ సమీపంలో తను ఉండే హాస్టల్‌కు నడుచుకుంటూ వెళుతోంది. డీఎల్ఎఫ్ మొదటి గేట్ ఎదురుగా ఉన్న టీసీఎస్ సినర్జీపార్క్ గేట్ వద్ద కాపు కాచిన ప్రశాంత్ ఆమె మెడలోని గొలుసు లాక్కొని సమీపంలో ఉన్న జనార్దన్ యాదవ్ బైక్‌పై పరారయ్యారు. సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు నిందితులను, బైక్‌ను గుర్తించారు. గచ్చిబౌలిలో గురువారం వాహనాల తనిఖీలు చేస్తుండగా బైక్‌ను గుర్తించి ఇద్దరిని పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, 8 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఒకరు లోన్ ఈఎంఐ కోసం, మరొకరు ఉద్యోగం లేక తాగుడుకు బానిసలుగా మారి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడాలని నిర్ణయించుకున్నారని డీసీపీ తెలిపారు. క్రైం సిబ్బందికి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ కమిషనర్ నంద్యాల నర్సింహారెడ్డి, ఏసీపీ రఘునందన్‌రావు, సీఐ సురేష్, డీఐ రవీందర్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

రూట్ మారిన 47వై/ఎం బస్సులు

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్‌నెం.78లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తుండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ స్తంభించిపోతూ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఫిలించాంబర్ నుంచి షేక్‌పేట ఓల్డ్ ముంబయి వరకు రూ. 1.15 కోట్లతో అన్ని హంగులతో రోడ్డును విస్తరించినా ఆర్టీసీ బస్సులు వినియోగించుకోవడం లేదని దీని వల్ల రోడ్‌నెం 78పై భారం పడుతున్నదని ట్రాఫిక్ ఇక్కట్లు పెరిగిపోతున్నాయని 'సాక్షి' వివరించింది. దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. విస్తరించినా... వినియోగించని శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రాంమోహన్ ఈ మేరకు రాణిగంజ్ డిపోకు చెందిన 47వై/ఎం రూట్ బస్సులను గురువారం నుంచి రూట్ మారుస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ బస్సులన్నీ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 78 నుంచి కాకుండా ఫిలింనగర్ కొత్త చెరువు మీదుగా షేక్‌పేట ఓల్డ్ ముంబయి రోడ్డు మీదుగా మణికొండ, నార్సింగ్, మంచిరేవుల వైపు వెళ్లేలా ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడ స్పందన చూసి 47/ఎల్ రూట్ బస్సులను కూడా మారుస్తామని ఆయన వెల్లడించారు. దీని వల్ల జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 78పై ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రమాదాల నివారణతో పాటు బస్సులు కూడా అనుకున్న రీతిలో ప్రయాణికులకు అందుబాటులో ముందుకు సాగేలా ప్రణాళికలు రూపొందించామని డీఎం వెల్లడించారు.

యువత ప్రధాన భూమిక పోషించాలి



జెండా ఎగురవేస్తున్న నాయకులు

మియాపూర్ : దోపిడీ సమాజంలో మార్పు రావాలంటే యువత ప్రధాన భూమిక పోషించాలని ఏఐఎఫ్ డీవై రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కర్రా రాజిరెడ్డి అన్నారు. మియాపూర్‌లోని ముజాఫర్ అహ్మద్ నగర్ లో ఏఐఎఫ్‌డీవై రాష్ట్రస్థాయి రాజకీయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వ్యవస్థలో నేటికి అసమానతలు తొలగలేదన్నారు. భారతదేశంలోని దోపిడి, అవినీతి, కులమత వ్యవస్థలను రూపుమాపాలంటే యువత సమాజ మార్పుకై పోరాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి గాదగోని రవి, రమేష్, వనం సుధాకర్, తుకారాం నాయక్, ఎండీ సుల్తానా, కీర్తి, దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది నెలలు.. 77216 కేసులు

'రోప్'లో భారీగా ట్రాఫిక్ ఉల్లంఘనలు

మరోసారి స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమవుతున్న ట్రాఫిక్ పోలీసులు

వాహనాలు తేలికగా ముందుకు వెళ్లడం, ఫుట్‌పాత్‌లపై పాదచారులు ఎలాంటి అడ్డంకులు లేకుండా సాఫీగా నడిచి వెళ్లడం లక్ష్యంగా గతేడాది సెప్టెంబర్ 15వ తేదీన ట్రాఫిక్ పోలీసులు రోప్ (రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్స్) విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మూడు వారాల పాటు వాహనదారులకు, ఫుట్‌పాత్ ఆక్రమణదారులకు అవగాహన కల్పించారు. సిగ్నళ్ల వద్ద ఎడమ వైపు వెళ్లే వాహనదారులు తేలికగా ముందుకు వెళ్లేలా ఫ్రీ లెఫ్ట్ అడ్డంకులు లేకుండా చూసేందుకు ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చి పకడ్బందీగా ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద వెనుక వచ్చే వాహనాలు ఆగకుండా చూశారు. ఇక సిగ్నళ్ల వద్ద స్టాప్‌లైన్‌ను దాటి ముందుకు వచ్చే వాహనాలు నిలిపేవారిపై కొరడా ఝులిపించారు.

బంజారాహిల్స్: పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ పరిధి (వెస్ట్ జోన్ ట్రాఫిక్) కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట, బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతేడాది 15వ తేదీ నుంచి ఈ ఏడాది మే 5వ తేదీ వరకు ఎనిమిది నెలల్లో ఫుట్‌పాత్ ఆక్రమణదారులు, స్టాప్‌లైన్, ఫ్రీ లెఫ్ట్‌లో బ్లాక్ చేసిన వారిపై 77,216 కేసులను నమోదు చేశారు.

- ఇందులో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి పాదచారులకు అడ్డంకులు కలిగించిన 52 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఫ్రీ లెఫ్ట్‌లు బ్లాక్ చేసిన 7539 మందిపై, స్టాప్‌లైన్లు దాటి ముందుకు వచ్చిన 69625 మందిపై ఉల్లంఘనల కేసులు నమోదు చేశారు.
- ఈ కేసులన్నీ రోప్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఇప్పటికే స్టాప్‌లైన్, ఫ్రీ లెఫ్ట్, ఫుట్‌పాత్ ఎంక్రోచ్‌మెంట్లపై వాహనదారులకు, వ్యాపారులకు అవగాహన భారీగా పెరిగినా ఇంకా కొన్ని చోట్ల ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయని అధికారుల దృష్టికి రావడంతో మరోసారి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుడుతున్నారు.
- ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ రోప్‌ను మరింత పటిష్టంగా అమలు చేసే దిశగా తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లకు సిద్ధమవుతున్నారు.
- స్టాప్‌లైన్ ఉల్లంఘించిన వారు బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా ఉండగా ఫ్రీ లెఫ్ట్ బ్లాక్ చేసిన వారు జూబ్లీహిల్స్ పరిధిలో అధికంగా ఉన్నారు.

పోలీస్ స్టేషన్	ఫుట్‌పాత్ ఆక్రమణలు	ఫ్రీ లెఫ్ట్ బ్లాక్	స్టాప్‌లైన్ దాటిన వారు
పంజగుట్ట	10	447	8955
ఎస్ఆర్‌నగర్	13	2599	8999
జూబ్లీహిల్స్	4	2975	18693
బంజారాహిల్స్	11	965	14153
బేగంపేట	14	553	18825
మొత్తం	52	7539	69625

వాహనదారులు బాధ్యతగా ఉండాలి



ఫ్రీ లెఫ్ట్‌లు బ్లాక్ చేసే వారిపై, స్టాప్‌లైన్ దాటిన వారిపై ఇప్పటికే పెద్ద ఎత్తున ఉల్లంఘనల కేసులు నమోదు చేశాము. నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబు, నార్త్ డిస్ట్రిక్ట్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు ఇప్పటికే మా పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట, బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరంగా జరుగుతున్నది. మరోవైపు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి పాదచారులకు అడ్డంకులు కలిగిస్తున్నవారిపై కూడా ఆయా పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. పాదచారుల భద్రతకు పెద్ద పీట వేయడంలోనూ, వాహనదారులు ఎక్కడా ఆగకుండా తేలికగా ముందుకు సాగే విధంగా ఉన్నతాధికారులు సరైన ప్రణాళికలు రూపొందించి ఆదేశాలు ఇస్తుండగా వాటిని సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతున్నది. మరోసారి రోప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. స్టాప్‌లైన్ దాటిన వారికి, ఫ్రీ లెఫ్ట్ బ్లాక్ చేసిన వారికి ట్రాఫిక్ పోలీసులు రోజూ అవగాహన కలిగిస్తున్నారు. ప్రజలు మరింత బాధ్యతగా వ్యవహరించాలి. ట్రాఫిక్ పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించాలి. ఉల్లంఘిస్తే తమతో పాటు ఇతర వాహనదారులకు కూడా ఇబ్బందులు ఉంటాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

– శంకర్‌రాజు, ఇన్‌చార్జి ట్రాఫిక్ ఏసీపీ వెస్ట్‌జోన్